# కలెక్టరూ క్షమించు

నమస్కారం గురూగారూ! బాగా చదువుతున్నారా? మీకేంలెండి. నిక్షేపంలాంటివాళ్ళు. చదివి బాగుపడవలసిన వాళ్ళు. ఐయే యస్‌కి వెళ్ళవలసిన వాళ్ళూను. గుడ్‌లక్. వొస్తాను" ఎక్కడ్నుంచి ఒచ్చాడో ఒచ్చీ రావడంతోటే బడ బడా నాలుగూ అనేసి మళ్ళా తనకేమీ పట్టనట్టు యీల పాట పాడుకుంటో వెళ్ళిపోయేడు గుర్నాథం.

ప్రసాదం మనసు చివుక్కుమన్నది. మళ్ళీ పుస్తకంలో చూపు నిలిపేడు.

కాలేజీలో చేరిన మొదటిరోజుల్లో ఈ కోరిక పుట్టింది. రాను రానూ అంతరాంతరాల్లో పురుగులా తిరగడం మూలంగా చివరికి తప్పదన్నట్టూ యీ ఆఖరి సంవత్సరంలో పదిమంది ఎదటా చెప్పేడు. మరోప్పుడైతే అదీ చెప్పక పోను.

'హాస్టల్ డే'—

వెయ్యిదీపాలు వెలుగుతున్నాయి. దీపాలకాంతిలో ఆవరణంతా కన్నుల పండువుగా వుంది. వేదికమీద కాలేజి ప్రిన్సిపాల్, వారి కుడిపక్క హాస్టలు వార్డెన్, ఎడంపక్క ఆ వూరి ఛైర్మను. 'భవిష్యత్తులో నేను' అనే విషయం మీద హాస్టలు కుర్రాళ్ళు ఒకరి తర్వాత మరొకరు మాటాడేస్తున్నారు. కార్యక్రమం పూర్తవుతుందనగా, హాస్టల్ సెక్రటరీ రామిరెడ్డి ప్రసాదం పేరు ఎనౌన్సు చేసేడు.

చిరుచెమటలు పోశాయి. కాళ్ళు ఒణికాయి. తడబడుతూ వేదికమీదకు వెళ్ళేడు. మైకుముందు నించున్న తర్వాత కలిగిన ఉత్సాహం అతనినింత అభాసు చేయిస్తోంది.

"ప్రసాదంగారు కలక్టర్రోయ్!"

పుస్తకాలపురుగు, బుద్ధావతారం, చంటిబాబు – ఈ మొదలైన ముద్దుపేర్లు చాలవన్నట్టు, ఆనాటినుంచీ ఈ పిలుపుతో అలంకరిస్తూన్నారు వీళ్ళందరూ.

నిజానికి దీన్లో తప్పేముందసలు? చదువుకుని, చేసిన కృషితో బాగుపడి కలక్టరవడం తప్పా? ఈ ఉద్దేశాన్ని గుండెల్లో దాచుకోడం నేరమా? సమయం వచ్చింది గనక, నేను ఫలానా, నా జాతకం ఫలానా అని జోస్యం చెప్పడం అభాసా?

కాదని చాలా తడవలనుకున్నాడు ప్రసాదం. కానీ, వీళ్ళనోళ్ళు మంచివికావు. ఒకమనిషి అభిప్రాయానికి విలువనిచ్చే సివిలిజేషను వీళ్ళకి చాలా దూరం. అందుచేత రోజుకో

మాటైనా పలకరిస్తోన్న తన కల పరాయివాళ్ళ దృష్టిలో ఒకానొక హాస్యగాడి వింత కోరికలా నిలిచిపోయిందేవిటాని బాధ. అప్పుడు మనస్సంతా సిగ్గుతో నిండుకుపోతుంది. ఇదో రకమైన శిక్ష.

ప్రసాదానికి వాళ్ళ డాడీ గుర్తుకొచ్చేరు. వారి హోదాలాటి నల్లటి ఫియట్ కారు గుర్తుకొచ్చింది. వారి పరువు మర్యాదల్లాంటి అందమైన 'కాంతిభవనం' గుర్తుకొచ్చింది. వారి మంచి మనసులాటి ఏభయి ఎకరాలమాగాణి గుర్తుకొచ్చింది. వారి పూర్వజన్మ సుకృతానికి సాక్ష్యాలైన డాక్టరూ, లాయరన్నయ్యలు గుర్తుకొచ్చేరు.

ఆ కుటుంబంలోని సభ్యుడు తను. తనకి కలక్టరవ్వాలనే ఆశ ఉండటంలో అతిశయోక్తి లేదు. అనుకోకూడదు గానీ – తనని యీగిచేస్తోన్న వాళ్ళల్లో యే కొందరైనా జీవిత పర్యంతం తనకి బానిసలుగా యేర్పాటు చేసుకోగల తాహతు తనది. తన అంతస్థేమిటో తెలీని ఫూల్స్.

మనసారా నమ్ముకుంటోన్న లక్ష్యం ఐ యే యస్. ఊహా ప్రపంచంలో, ఉద్దేశాల లిస్టులో చెరగని ముద్ర కలక్టరుగిరి. ఇది తననుంచి దూరం కావడంకల్ల. తన ప్రయోజకత్వమేమిటో తెలిసినవాడు ఈ గుర్నాధమే తనదగ్గర దిక్కుమాలిన గుమాస్తా ఉద్యోగం చేయగలడు.

అందర్లో తన అంతస్థు గురించి చెప్పేయాలన్నంత ఉద్రేకం కలుగుతుంది ఒక్కోనాడు. కానీ, అర్థం చేసుకోలేని అనాగరికులముందు, తనమూలంగా – ఉచ్చమైన తన కుటుంబం గూడా చిన్నచూపు రుద్దుకోడం యిష్టంలేదు. అందు

చేతనే కోపాన్ని దిగమింగుకుని, కసిని కప్పి పెట్టుకుని బతుకు తున్నాడు.

పుస్తకం మూసేడు. లేచినుంచుని గదివేపు వెళ్ళ బోయేడు. రామిరెడ్డి పిలుపుతో ఆగి నుంచుని పలుకరింపుగా అలవోకగానవ్వేడు. రామిరెడ్డి గబగబా ప్రసాదం దగ్గరికొచ్చి అతని చేతిని లాక్కుంటూ,

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు.

"ఎందుకనిట?"

"కొట్టేవ్. ఎస్సే కాంపిటీషన్లో ఫస్టొచ్చేవ్."

"థేంక్స్."

"పద. కేంటీన్‌లో కాఫీ పోయించు. జీవుడు అల్లాడి పోతున్నా నీకోసం వెతకడం మానలేదు."

"వొద్దు. ఇవాళ నా మనసు బాగోలేదు."

"వెధవ మనసు. తీసిపారేయ్. శుభవార్త తెచ్చిన దూతకి ఆకలెక్కువ, సంప్రదాయాన్ని మర్డర్ చేయకు. ముందునడు."

"నే రాలేనులే రెడ్డీ నువ్వెళ్ళు."

"అందుచేతనే నిన్నందరూ అంటున్నారు — సంఘ జీవివికావూ అవటాని. నా చేతకూడా ఆ మాటనిపించకు ప్రసాదం!"

రామిరెడ్డితో పాటు కేంటీన్లోకి అడుగు పెట్టేడుప్రసా దం. నాలుగైదు తలలు అటూ యిటూ వెతికి వేలాడి మరో రెండుమూడు తలల్ని పలుకరించి కలిసికట్టుగా మొత్తం కిసు

కున్న నవ్వేశాయి. ప్రసాదం ఈ రకమైన వాతావరణానికి అలవాటు పడుతున్నవాడు గనుక అంతగా పట్టించుకోలేదు. వాళ్ళందరికీ దూరంగా ఓ మూల కూర్చున్నాడు. రామిరెడ్డి మరో యిద్దర్ని వెంటబెట్టుగొచ్చి ప్రసాదం దగ్గర కూర్చున్నాడు.

నలుగురికీ స్వీట్సు ఆర్డరిచ్చేడు రామిరెడ్డి. పుస్తకంలో తలదూర్చేడు ప్రసాదం.

"ఏంరెడ్డీ! శకుంతలమ్మ రాత్రి సినీమాకొచ్చిందట. నిజమా" కొత్తగావొచ్చిన యిద్దర్లో కేషియస్ అడిగేడు.

"ఎవరు చెప్పింది? వేణూనా?"

"మాకు తెలుసులే గురూ!" ఆడపిల్లగొంతు మగపిల్లాడు కులుకుతూ అన్నాడు.

"నాన్‌సెన్స్! ఎవడూ చెప్పింది మీకెల్లా తెలుస్తుందోయ్?" రామిరెడ్డి విసుక్కున్నాడు.

"తెలుసంతే!" కేషియన్ స్వీటు నోట్లో పెట్టుకుని ముద్దగా చెప్పేడు.

"నా! సినిమాకేకాదు. వెన్నెల్లో నాతోపాటు తిరుగుతుంది. సముద్రంలో నా సరసన నించుని స్నానం చేస్తుంది: శకుంతల కళ్ళంటే నా కెంతో యిష్టం యిలా అన్నానని వేణూతో చెప్పు. చెప్పి, వాడూ, నువ్వూ యిద్దరూ బడుద్ధాయిలని ఒప్పుకోండి. ఒప్పుకొని జాయింటుగా ఉరోసుకు చావండి తెలిసిందా? నెక్స్ట్ ...... మీ రిద్దరూ తింటూన్న స్వీట్సుగ్గానీ, తాగబోయే కాఫీగ్గాని బిల్లు ప్రసాదం ఇవ్వడు.

మీ దగ్గర డబ్బుల్లేకపోతే మీ చొక్కాలు తాకట్టు పెట్టండి. అండర్‌స్టాండ్! కమాన్ ప్రసాదం! మనం చివరి ఛైర్‌కి పోదాం. డర్టీ క్రీచర్స్!" ప్రసాదం చేయి పట్టుకుని అవతలికి లాక్కుపోయేడు రామిరెడ్డి.

నల్లుల్లాగా బల్లకి అతుక్కుపోయేరు మిగిలిపోయిన ఆ యిద్దరూను!

కాఫీ తాగి బైటకొచ్చేసింతర్వాత రామిరెడ్డితో ప్రసాదం బిక్కు బిక్కు మంటూ అన్నాడు.

"నువ్వాగనక సరిపోయింది. ఒక్కడూ నోరెత్తలేదు. అదే నేనైతే కలబడి కొట్టేవారు."

"పోనీ ప్రసాదం! వాళ్ళతో మనకేంపనిగానీ, యెలా చదువుతున్నావ్? మూణ్నెళ్ళలో పరీక్ష లున్నాయి మరి."

"......... "

"బైదిబై – కాంపిటీషన్లో ఐ స్టుడ్ సెకండ్."

"చెప్పావ్ కాదే? హార్టీ కంగ్రాచ్యులేషన్స్. బలే వాడివి. ఇంత మంచివిషయాన్నింతసేపు దాచావా? అయినా పొరపాటు నాందేలే. సెకండెవరో కూడా అడగలేదు – ఎంతకీ నా గురించి నేనే ఆలోచించుకుంటున్నాను. క్షమించు,"

"బలే. ఎంతపాఠం చదివేవోయ్ ప్రసాదం? ఇదంతా నాకోసవేం;"

"అదికాదు రెడ్డీ!"

"డోన్టాక్. పొగడ్తలొద్దు. ఇవాళ సినిమాఖర్చు నాది. వొస్తావా?"

"సినిమానా? నయం."

"రమ్మన్నది నరకానికి కాదుగా."

"వార్డెన్ కళ్ళల్లో కారం గొట్టి సినిమాకెళ్ళి, మళ్ళా రావడమంటే..."

"రోజూ మేమెళ్ళడం లేదుటయ్యా?"

"నాకు భయం రెడ్డీ!"

ప్రసాదం భుజంతట్టి చెప్పేడు రామిరెడ్డి;

"హాస్టల్ గోడ యీజీగా దూకొచ్చు. దూకింతర్వాత మన అచూకీ నరమానవుడికి తెలీదు:"

"పోనీలే బాబూ! కావలిస్తే ఆదివారం మాట్నీకి వెడదాంగాని ప్రస్తుతం నన్నొదిలేయ్."

"ఈ చిన్ని వెంచర్ చేయలేని వాడివి, రేపొద్దున్న నువ్వు కలెక్టరెలా అవుతావోయ్?"

ప్రసాదంలో కొట్టొచ్చినట్టు మార్పు కనిపించడంతో రామిరెడ్డి మరి మాటాడలేదు. అలా గార్డెన్ వేపు తీసుకెళ్ళి, తన అభిప్రాయాన్ని ప్రసాదంతో చెప్పుకున్నాడు.

"చూడు ప్రసాదం! ఏ వయస్సులో కావలసిన సరదాలు ఆ వయసులో చేస్తేనే అందం. వొప్పుకుంటావా? కనుక నువ్వూ నాలాగా తిరిగేయ్. అంటున్నానని కాదుగాని ఇందువల్ల నీ 'యాంబిషన్స్' మట్టి కొట్టుకుపోవు, విశేషంగా ఐ. ఏ. యస్. కాగలవు. నన్ను చూడు. నేనూ నీలాగానే చదువుకుంటున్నాను. మంచిమార్కులే తెచ్చుకుంటున్నాను అవునా? అవుతే నీలాగా ఇరవైనాలుగ్గంటలూ పుస్తకాలు

తిరగేయడం లేదు. అందులో సుఖమూ లేదు. నన్నడుగుతే మనిషికి రిక్రియేషనుతో అవసరమెంతైనా వుంది. రోజుకింత సేపని రిలాక్సవ్వాలి. అది మంచి చేస్తుందేగాని హాని చెయ్యదు. నా మాటవిని కొంచెం పట్టించుకో. నే చెప్పినట్టు ప్రయత్నించు. జస్ట్ ట్రై ఇట్. నువ్విలా మారగలిగిననాడు నిన్నీ జంతువులు తినలేవు. పైగా నువ్వంటే టెర్రర్‌తో హడలి ఛస్తారు. అలా అని రాసివ్వగలను, ఆలోచించు."

ప్రసాదం ఆలోచనలో మునిగిపోయాడు.

—రాత్రి రెండుదాటింది. గదిలో ప్రసాదం ఒక్కడూ కూర్చున్నాడు. అతను అప్పటికే రెండు సిగరెట్లు కాల్చేడు. మూడోదికూడా బలవంతంమీద వెలిగించేడుగానీ విపరీతమైన దగ్గురావడంతో దాన్ని యాష్ట్రేలో కుక్కి కొంచెం మంచి నీళ్ళుతాగి నడుంవాల్చేడు. తలపక్కనున్న అలారం టైం పీస్ సుతిమెత్తని శబ్దం చేస్తోంది. ఆ శబ్దంలో రామిరెడ్డి చెప్పిన ప్రతిమాటా శ్రుతి కలుపుకుంటోంది.

నిజమే. జీవితానికి కావలసింది కలక్టరు గిరొక్కటే కాదు. ఇంకా చాలా కావాలి. సుందరమైన అనుభవాలు ఆస్వాయించుకోవాలి; తోచనప్పుడల్లా నెమరేసుకోడానికి. రామిరెడ్డి జ్ఞాని. అందుచేతనే అంత మహత్తరంగా వెలిగిపో తున్నాడు.

అలారం మోగడంతో ఉలిక్కిపడ్డాడు ప్రసాదం. టైం పీస్‌ని తీసుకుని అలారం ఆపేడు. టైంపీస్‌లో కోడి, తన పిల్లల్తో ఆడుకుంటోంది. ఆ ఆట సరదాగానూ వుంది. ఆవేళకి తలుపు తెరుచుకున్నది.

"మే ఐ కమిన్ ప్లీజ్" వేణు సరదాగా అన్నాడు.

"ప్లీజ్ కమిన్" ప్రసాదమూ సరదాగా అనేశాడు.

వేణు తలుపేసి ఒచ్చి బట్టలు మార్చుకుండానే కేంప్ కాట్ మీాద వాలిపోయేడు. కాలికున్న బూట్లతో వింతైన చప్పుడు చేస్తో అన్నాడు.

సినిమా బాగుంది దేవతలు తీయవలసిన సినిమా అది. అందుచేతనే ఇంగ్లీషు సినిమాలంటే నాకంత యిష్టం."

"ఇప్పుడు నువ్వు గోడదూకే ఒచ్చేవా వేణూ?" కుతూహలంగా అడిగేడు ప్రసాదం:

"ఎగ్జాక్లి! గోడదూకడమనే ఆర్టు హైస్కూల్లో వున్నప్పుడే నేర్చుకున్నాను."

"సినిమాలో మా రామిరెడ్డి కనిపించేడా?"

"ఆహా. అతనూ యిప్పుడే వొచ్చేడు ఇప్పుడు తొంభై మూడో గది పేట్రేగి పోతూండొచ్చు."

"ఎందుకనిట?"

"ఫూల్! తాగొచ్చేడు, గోడ దూకేప్పుడు తూలి పడబోతే నేను సాయం చేశాను. కనీసం థేంక్సయినా చెప్పలేదు."

రామిరెడ్డి గురించి ఈ విధమైన రిపోర్టు ప్రసాదానికి నచ్చలేదు. టైంపీస్‌లో వున్న గోడిసంతానంతో ఆడుకోడం ప్రారంభించేడు. మధ్యలో అడిగేడు వేణు.

"టైంపీస్ బాగుంది కదూ?"

"ఐ లైకిట్!"

"శకుంతల గుర్తొచ్చినప్పుడల్లా టైంపీస్‌ని పగలగొట్టాలనిపిస్తుంది కానీ, దాన్ని మామయ్య నాకిచ్చేడు. శకుంతలకి నేనంటే నిర్లక్ష్యమైనా, మామయ్యకి నేను ప్రాణం. మీ రామిరెడ్డి నన్ను తినేస్తున్నాడుగానీ లేకపోతే రెణ్నెళ్ళ క్రితమే శకుంతల నా దయ్యేది. రామిరెడ్డి గురించి నీకేం తెలీదు గురూ! అతనా ఫస్ట్‌క్లాస్ రోగ్. క్లాసులెగ్గొట్టి సినిమాలకే కాదు. క్లబ్బుకెళ్ళి పేకాట ఆడుతాడు. అతని చుట్టూ అప్పులు. అయినా ఋవేం తెలీనీకుండా పేట్రేగిపోతున్నాడు. అంతా షో..."

"ప్లీజ్. అతని గురించి చెడు చెప్పకు నాకు. మంచేమైనా తెలిస్తే చెప్పు. విని సంతోషిస్తాను."

"ఫ్రెండుకదూ!"

"అంతేకాదు. జీనియస్ కూడానూ."

"వల్లకాదు"

"నీ కతనంటే జెలసీ."

"కాదు. నా మీద అతనికి పగ."

"పోనీలే పడుకో."

"ఎంతసేపని ఆ టైంపీసుని గుండెలమీద పెట్టుకుంటావ్, అవతలుంచేయ్. అన్నట్టు ఇవాళ ఇంతసేపు మేలుకున్నావే!"

"రేపట్నుంచి నేను మేలుకునే ఉంటాను వేణు."

"నువ్వు ఏవైనా పుచ్చుకున్నావా?"

ప్రసాదం జవాబు చెప్పలేదు. వేణు వినదలచుకోనూ లేదు. అయిదు నిమిషాల్లో నిద్రపోయేడు. అతని నిద్ర

చూస్తూంటే ప్రసాదానికి ఆశ్చర్యం వేసింది. తర్వాత అనుకున్నాడు.

'వీళ్ళందరూ అదృష్టవంతులు'

దూరంగా ఉన్న తారురోడ్డుమీంచి లారీల రొద వినిపిస్తోంది మంద మందంగా. ప్రసాదం మస్తిష్కంలో ఆలోచనలు రంగులు పులుముకుంటున్నాయి. వేణూ దగ్గర్నుంచి వొస్తున్న ఖరీదైన సెంటువాసన ప్రసాదాన్ని మరో లోకంలోకి తీసుకుపోయింది.

* * *

ఆ మరుసటిరోజు రాత్రి పదిప్రాంతాల గదిలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు ప్రసాదం. రూమ్మేటు వేణు ఆవేళకి స్వర్గమనే బజార్లో మజా చేస్తూంటాడు. రామిరెడ్డి అనుభవాల వేటలో తారస్థాయి నందుకుంటూ వుంటాడు. ఒక దిక్కుతోచని ప్రసాదమనే పురుగు గది దాటడమనే చిన్న సమస్యని భూతద్దం నుంచి చూచి భయపడి పోతున్నాడిక్కడ అని అనుకున్నాడు. ఆ పైన వేదాంతిలా నవ్వుకున్నాడు.

మరోమాటు తలదువ్వుకున్నాడు. కాలరు సర్దుకున్నాడు. తలుపుకి తాళం వేసి గోడవైపు పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటో నడిచేడు. గోడ చేరిం తర్వాత గుండెల్లో భయం కలుక్కుమన్నది. గుండె నిబ్బరం చేసుకుని గోడెక్కాడు. కిందికి దూకుతుండగా, బైటనుంచి రామిరెడ్డి కాబోలు లోపలికి సునాయాసంగా దూకేశాడు.

రోడ్డుమీద అడుగుపెట్టి ప్రసాదం నవ్వుకున్నాడు, ఈ రోజు తనిష్ట మొచ్చినట్టు తిరిగి. రేపు సాయంత్రం తను చూసిన 'రాత్రి వింతలు' రామిరెడ్డికి చెప్పి అతనిచేత భేషని పించుకోవాలి.

గబగబా నడిచేడు. రెండు ఫర్లాంగులు నడిచిం తర్వాత రిక్షా దొరికింది. రూపాయన్నర బేరంతో వూళ్ళోకి వొచ్చి వాలేడు. రైల్వేస్టేషన్ రోడ్డులో అనుకోకుండా గుర్నాథం తారసిల్లేడు. అతన్ని తప్పించుకు వెళ్ళాలనిపించింది కానీ, ఆ పక్షి కంట్లో పడక తప్పింది కాదు. ట్యూబ్ లైటు క్రింద నించున్న గుర్నాథం తనని పసిగట్టి, పొడిగా నవ్వి, సిగరెట్టు పొగ ఆకాశంమీదికి విలాసంగా ఒదిలి పక్కనున్న ఓ శిష్య పరమాణువుతో కులాసాగా అన్నాడు.

"పక్షి గూడు వొదిలింది. ఇవాళ ఎవడి ఖర్మ కాలిం దన్న మాట. శివోహాం. గూడు దాటిన కలక్టరూ! క్షేమంగా తిరిగిరా!"

వెనక్కొచ్చి మొహంమ్మీద రెండు వాయించేద్దామను కున్నాడు. బక్క పీనుగ చచ్చిపోతాడనుకుని, ఆ ప్రయత్నం మానుకున్నాడు ప్రసాదం. థియేటరు దగ్గర నించున్న వేళకి రెండో ఆట ఇంటర్వెల్లు ముగిసింది. టిక్కెట్టు తీసుకుని వేణూ మెచ్చుకునే ఇంగ్లీషు సినిమాకి వెళ్ళేడు.

వేణు చెప్పినట్టు ఆ సినిమాని దేవతలు తీయవలసింది. కాకపోగా మానవమాత్రుడు చూడతగ్గది కాదు. సినిమా నిండా ముద్దులూ, వెచ్చటి కౌగలింతలూ, వెకిలి చేష్టలూను. ఇది ప్రసాదం నోటిమాట. కానీ, అతని గుండెలోని గొంతు

మాట వేరు. అది తలుచుకుంటూంటే వొళ్ళు పులకరిస్తోంది. మనసుకి అలరింపు కలుగుతోంది.

హాస్టలువరకూ తీయటి ఊహాల్నెక్కి వొచ్చేడు నెమ్మదిగా. టైం చూచుకుని భయపడి పోయేడు. మూడు దాటి పది నిమిషాలై పోయింది. ఇప్పటి వరకూ సుందరమైన ఊహాలకి తలతాటిస్తూ నడిచి వొచ్చిన ప్రసాదానికి తనముందున్న హాస్టలుగోడ ఆకాశమంత ఎత్తు ఎదిగిన ట్లనిపించింది. మళ్ళా అంతలోనే రామిరెడ్డీ, వేణూ, గుర్నాథం - వగైరాలు గుర్తు రావడంతో డాబామీద పిట్టగోడంతగా కుంగిపోయింది.

ఈల వేసుకుంటూ గోడెక్కి కళ్ళుమూసుకుని సునాయాసంగా దూకేశాడు. కిందపడ్డవాడు మరి లేవలేకపోయాడు. వెయ్యేనుగులు తలమీద తిష్ఠవేసుకున్నట్లనిపించింది.

ఎదురుగా దేదీప్యమానంగా లైట్లు వెలుగుతున్నాయి. బారులు తీర్చినట్లు కుర్రాళ్ళందరూ వరండాలో నించున్నారు. వాళ్ళందరిముందూ ఓ కుర్చీలో వార్డెన్ కూర్చున్నాడు. సముద్ర ఘోషలాంటి వాళ్ళ సంభాషణ ఫలానా వొస్తువు గురించి అని తెలీడం లేదు.

తను గోడదూకిన రెండుక్షణాల్లో సాగుతున్న ఘోష తక్కున ఆగిపోయింది. చీమ చిటుక్కుమన్నా శబ్దమయ్యేంత నిశ్శబ్దం. అంత నిశ్శబ్దాన్ని భరించలేక పోయేడు ప్రసాదం. పైపెచ్చు - బాణాల్లాంటి వీళ్ళందరి చూపులూ తనమీద కేంద్రీకరింప బడటంతో లేచినించోడానికే భయం వేస్తోంది. అతి కష్టంమీద లేవగలిగేడు. ముందుకో అడు వేశాడు.

అందరి చూపుల్లోనూ ఉత్కంఠ పెరిగిపోతోంది.

గోడలుదూకి సినీమాలకెళ్ళడమనే సుగుణం వార్డెన్‌కి తెలిసుంటుంది. గనకనే ఈ వేళప్పుడిలా వొచ్చేడు. ఎప్పుడూ గుమ్మందాటి ఎరుగని తను సినీమాకెళ్ళిన వైనం గిట్టనివాళ్లు ఆయన చెవినేయడంతో ప్రసన్నమైన ఆయన మొహంలో నిప్పులు మండుతున్నాయి. ఇవాళ ఇంత మందిలో, ఆయనచేత చివాట్లు తినడమనే చరిత్రాత్మకమైన సన్నివేశం కొన్ని క్షణాల్లో ప్రారంభం కాబోతుందని తెలిసిన మరుక్షణం అతని నరాలన్నీ కత్తితో కోస్తున్నట్లు బాధకలిగింది. ఆ కొంచెం దూరమూ వెయ్యియోజనాల వరకూ పెరిగినట్లు భ్రమకలుగుతోంది. అడుగులు తడబడుతున్నాయి. పెదాలమీద తడి ఆరిపోతోంది.

దూరం దగ్గరవుతున్నకొద్దీ ప్రసాదం ఒణికిపోతున్నాడు. అడుగులు లెక్కపెట్టడం ప్రారంభించేడు. సరిగ్గా ఏభై ఆరు —

"ఐయామ్ వెరీసారీ మిస్టర్ ప్రసాదరావ్!" వార్డెన్ మెత్తగా అన్నా, దాని వెనకనున్న కర్కశత్వం గుండెల్ని ఆయన చూపులు తనని కాల్చేస్తున్నాయి.

"ఈ ప్రాక్టీసెన్నాళ్ళ నుంచీ?" మళ్ళీ నిలదీసి అడిగేరు.

"........."

"ఐవాంట్ యువర్ రిప్లై."

"ఇవాళొక్కరోజే సార్!"

ప్రసాదం జవాబు విని కుర్రాళ్ళందరూ ఘొల్లున నవ్వేశారు. ప్రసాదం తల దించుకుంటూండగా వార్డెన్ గట్టిగా అరిచేడు — 'షటప్' —

నవ్వు లాగిపోయేయి. ఈ హెచ్చరిక తనొక్కడికోసం చేసిందో, నవ్వుతూన్న వాళ్ళందర్నీ మందలించడమో అంతు బట్టింది కాదు. ప్రసాదం కళ్ళల్లో నీళ్లు నిండుకున్నాయి.

"ఇక కన్నిరొక్కటే తక్కువ. నిజం చెప్పాలి. ఇంత వరకూ ఎక్కడున్నారు?"

అబద్ధం చెప్పాలనీ లేదు. అందుచేత నిజమే చెప్పేడు. సినిమా కెళ్ళేను సార్."

గుర్నాధ మొక్కడూ నవ్వేడు. వార్రెన్ ఈ మాటు 'షటప్' అనలేదు గుర్నాధం నవ్వు ఆపి ప్రసాద్నాన్ని అడిగేడు.

"మీ కసలు సినిమా కెళ్ళే అలవాటుందా కలక్టరు గారూ?"

వార్రెన్ గుర్నాధంవేపు తమాషాగా చూట్టంతో గుర్నాధం మరింత ఉత్సాహంగా అనేశాడు.

"ఎక్స్యూజ్మీ సార్! మా ఫ్రండొకడు ఈ ఊరొస్తున్నాడంటే రిసీవు చేసుకునేందుకు స్టేషను కెళ్ళేనండి. ఇతను పదకొండు ప్రాంతాల్లో ఆ రోడ్డుమీద భయం భయంగా తిరుగుతున్నాడండి. కావలిస్తే అతన్నే అడగండి సార్."

"నిజమేనా ప్రసాదం?" వేణు అడిగేడు.

'నిజమే' అన్నట్టు తలూపేడు ప్రసాదం.

"పదకొండు గంటలికి సినిమా ఏమిటి?" వార్రెన్ అనుమానంగా అడగడంతో యీ చర్చ కేవలం సినిమా గురించే కాదని ప్రసాదం భావించేడు. బెరుగ్గా సమాధానం చెప్పేడు.

"వెళ్ళేను సార్. ఇంగ్లీషు సినిమ."

"అయ్యా బాబోయ్! ఇంగ్లీషు సినిమానే" గుర్నాథం హేళన చేసేడు.

"డోంట్ టెల్మీ ఎనీమోర్ స్టోరీస్. మీగదిలో వేణు టైంపీసూ, వందరూపాయల చిల్లరా అది మీరేమైనా తీసేరా? ఆన్సర్ టూది పాయింట్. దట్సాల్." వార్డెన్ కుండ బద్దలుకొట్టేడు.

ప్రసాదం నెత్తిన పిడుగు పడినట్టయింది. జవాబు చెప్పే లోగా గుర్నాథం అందుకున్నాడు.

"అతనికి ఆ టైంపీసంటే చాలా యిష్టంట సార్. ఈ మధ్య డబ్బవసరంలో కూడా యిరుక్కున్నాడు సార్."

ప్రసాదం కాళ్ళకింద భూమి రెండు చీలికలైనట్టుంది. తను ఆశించిన కలక్టరుగిరి మన్నుగొట్టుకుపోయినట్టు భావించి, బంగారు భవిష్యత్తు బూడిదపాలైందని తెలిసిన మరుక్షణం అతను కుప్పలా నేలమీదికి వొరిగిపోయేడు, అవమాన భారంతో. దూరంగా రామిరెడ్డి కళ్ళొత్తుకుంటున్నట్టు లీలగా కన్పించింది.

◆ ◆ ◆

ఈ కథజరిగిన నెలరోజులక్కాబోలు రామిరెడ్డి ప్రసాదం వాళ్ళవూరు వెళ్ళేడు. ప్రసాదం. పొలంపనులు చూచుకుంటు న్నాడని తెలిసిన మరుక్షణం బాధపడ్డాడు. ప్రసాదం వాళ్ళ పాలేరు తోడురాగా పొలానికి వెళ్ళేడు రామిరెడ్డి. దార్లో పాలేరు ప్రసాదం జబ్బుగురించి వింతగా చెప్పేడు. అదోరక

మైన వ్యాధట. దానికి మందు లేదుట, రాత్రిపూట ఏవో పలవరింతలుట. పగల స్తమానం పొలంలో పిట్టల్ని తోలడం పనిట.

రామిరెడ్డికి భయంవేసింది.

పొలంగట్టున ఓ చెట్టు నీడకింద అందమైన కంబళిమీద ప్రసాదం కూర్చున్నాడు. అతని భుజాన ఫ్లాస్కుంది. చేతిలో ట్రాన్సిస్టర్ రేడియో వున్నది. తనెదుట భూమ్మీదికి వొరిగిన ఆకాశపుటంచుని నిశితంగా చూస్తున్నాడు ప్రసాదం.

రామిరెడ్డి నక్కడ వొదిలి పాలేరు తప్పుకున్నాడు.

రామిరెడ్డి ప్రసాదం దగ్గరికి వెళ్ళేడు. భుజంతట్టి పలుకరించేడు. ప్రసాదం పేలవంగా నవ్వేసి కూచోమన్నట్టు సైగ చేశాడు.

రామిరెడ్డి కూర్చోలేదు. పొంగివస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అన్నాడు.

“నన్ను క్షమించు ప్రసాదం! నీ జీవితాన్ని పాడు చేసింది నేను. వందమందిలో ఒక యోగ్యుడు అవమానం చెందుతూంటే చేసిన నేరాన్ని దాచుకున్న పాపిని నేను. నన్ను క్షమించు.”

౭)

ప్రసాదం ఫ్లాస్కులో వున్న కాఫీని ఇద్దరికీ పంచేడు. తల ఒంచుకునే అన్నాడు.

"పొలం పనులకి మరో కొత్త ట్రాక్టర్ని కొన బోతు న్నాం."

రామిరెడ్డి రాయిలా నించునే వున్నాడు.

— జ్యోతి మాసపత్రిక నుండి